www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,70306545

సంపుటి - 2 సంచిక -189 శుక్రవారం 20 సెప్టెంబర్ 2024 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -6 వెల - 3/-

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## కశ్మీర్‌లో పాకిస్థాన్ అజెండాను అమలు కానివ్వబోం

- ◆ ప్రధాని మోదీ
- ◆వారసత్వ రాజకీయాలకు ముగింపు పలికేందుకు బీజేపీకి ఓటు వేయాలని పిలుపు
- ◆జమ్ము కశ్మీర్ భవిష్యత్తు కోసం ఎన్నికలు జరుగుతున్నాయన్న ప్రధాని
- ◆వివిధ రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామన్న ప్రధాని



సెప్టెంబర్ 19,ప్రజావినికిడి:
కశ్మీర్‌లో పాకిస్థాన్ అజెండాను ఎట్టి పరిస్థితుల్లో అమలు కానివ్వబోమని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. జమ్ము కశ్మీర్ రెండో విడత ఎన్నికల ప్రచారం నేపథ్యంలో కాట్రాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీల మేనిఫెస్టో చూసి పాకిస్థాన్ సంబరాలు చేసుకుంటోందన్నారు. కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ పార్టీల వారసత్వ రాజకీయాలకు ముగింపు పలికేందుకు బీజేపీకి ఓటు వేయాలని పిలుపునిచ్చారు.
జమ్ము కశ్మీర్ భవిష్యత్తు కోసమే ఈ ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. జమ్ము కశ్మీర్‌పై కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ వివక్ష చూపుతూనే ఉందన్నారు. కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్‌లు పాకిస్థాన్‌కు నదీ జలాలు వెళ్లేలా చేస్తే, తాము ఆనకట్ట కట్టామన్నారు. కొన్నేళ్లుగా జమ్మూని ఈ మూడు పార్టీలు విస్మరించాయని ఆరోపించారు. తమ ప్రభుత్వం వివిధ రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తోందన్నారు.ఆర్టికల్ 370 గురించి కూడా ప్రధాని మోదీ ప్రస్తావించారు. ఆర్టికల్ 370ని రద్దు చేసిన తర్వాత వేర్పాటువాదం, ఉగ్రవాదం తగ్గిందన్నారు. వీటిని పూర్తిగా నిర్మూలిస్తామన్నారు. కశ్మీర్ యువత ఇప్పుడు రాళ్లకు బదులు, పెన్ను, పేపర్ పట్టుకుంటోందని వ్యాఖ్యానించారు. ఆర్టికల్ 370ని ఏ శక్తి వెనక్కి తీసుకు రాలేదన్నారు. జమ్ము కశ్మీర్‌ను తిరిగి రాష్ట్రంగా మారుస్తామని చెప్పారు. ఈ విషయాన్ని పార్లమెంట్‌లోనే ప్రకటించామని గుర్తు చేశారు.



స్కిల్ యూనివర్సిటీ బోర్డుతో రేవంత్ రెడ్డి

## నైపుణ్య శిక్షణకు పెద్దపీట


- స్కిల్ యూనివర్సిటీ బోర్డుతో రేవంత్ రెడ్డి భేటీ...
- పాల్గొన్న ఆనంద్ మహీంద్రా...
- హాజరైన నారా బ్రాహ్మణి
- వర్సిటీకి ప్రభుత్వం తరఫున రూ.100 కోట్లు కేటాయిస్తామని వెల్లడి

హైదరాబాద్ సెప్టెంబర్ 19,ప్రజావినికిడి:
తెలంగాణ సచివాలయంలో తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ బోర్డుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ భేటీలో మంత్రి శ్రీధర్ బాబు, యూనివర్సిటీ బోర్డు చైర్మన్ ఆనంద్ మహీంద్రా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో పాటు వివిధ రంగాలకు చెందిన పలువురు పారిశ్రామికవేత్తలు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ నిర్వహణకు ప్రభుత్వం తరఫున రూ.100 కోట్లు కేటాయిస్తామన్నారు.
యూనివర్సిటీ పూర్తిస్థాయి నిర్వహణకు కార్పస్‌ఫండ్ ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు. యూనివర్సిటీ నిర్వహణకు ఎవరికి తోచింది వారు వివిధ రూపాలలో సహకారం అందించాలన్నారు.తెలంగాణ నుంచి నైపుణ్యం కలిగిన యువతను ప్రపంచానికి అందించాలనే సీఎం ఆలోచన ఎంతో గొప్పదని ఆనంద్ మహీంద్రా ప్రశంసించారు. రేవంత్ రెడ్డికి మంచి విజన్ ఉందన్నారు. అందుకే యూనివర్సిటీ బోర్డు చైర్మన్‌గా ఉండాలని ఆయన కోరగానే అంగీకరించానన్నారు.

మిగతా 2లో.

## మాతాశిశు మరణాలపై ప్రభుత్వతీరు అమానవీయం

భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శలు



హైదరాబాద్ సెప్టెంబర్ 19,ప్రజావినికిడి:
హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో మాతాశిశు మరణాలపై రాష్ట్ర ప్రభుత్వం అమానవీయంగా వ్యవహరిస్తోందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.సమస్య పరిష్కారంపై దృష్టి సారించాల్సిన ప్రభుత్వం.. ప్రతిపక్షాలపై బురదజల్లే ప్రయత్నం చేస్తోందని గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. "ఆస్పత్రిలో శిశువులు, బాలింతల మృతిపై సమీక్షించారా? నాణ్యమైన వైద్యం అందిస్తున్నారా?
ఇటీవల జరిగిన బదిలీల్లో సీనియర్ డాక్టర్లను బదిలీపై పంపారన్న ఆరోపణల్లో వాస్తవం ఉందా? లేదా? ఈ ప్రశ్నలకు బదులు చెప్పాలి. గాంధీ ఆస్పత్రిలోని అనుభవజ్ఞులైన వైద్యులను బదిలీ చేయడం వల్ల అక్కడ చికిత్సలకు తీవ్రఆటంకం ఏర్పడుతోందనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలి.
కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోపిస్తున్నట్లు భారాస ప్రైవేటుకు కొమ్ముకాయాలనుకుంటే.. హైదరాబాద్ నగరం చుట్టూ పెద్దాస్పత్రులు, వరంగల్‌లో అతిపెద్ద ఆస్పత్రి నిర్మాణాలు కొనసాగేవేనా? బస్తీ దవాఖానాలు, గ్రామాల్లో క్లినిక్‌లు, 33 వైద్య కళాశాలలు ఏర్పాటయ్యేవా? కాంగ్రెస్ నాయకులు, పాలకులు మాపై ఎదురుదాడిని మానుకొని.. మీ పాలనలో ఉన్న లోపాలు సరిదిద్దుకోవాలి. గాంధీ ఆసుపత్రిలో కొనసాగుతున్న మాతాశిశు మరణాలపై భారాస తరఫున నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటుచేస్తాం. ఈ కమిటీ గాంధీలో జరుగుతున్న మరణాలకు సంబంధించిన అంశాలను గుర్తించి ప్రభుత్వంతో పాటు ప్రజలతో పంచుకుంటుంది" అని కేటీఆర్ పేర్కొన్నారు.

## త్వరలోనే ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

- రెండు పెండింగ్ డిఏల విడుదలకు ఆర్థిక శాఖ కసరత్తు..?
- ప్రభుత్వంపై రూ.300 కోట్ల అదనపు భారం



మిగతా 2లో.

హైదరాబాద్ సెప్టెంబర్ 19,ప్రజావినికిడి:
త్వరలోనే ఉద్యోగులకు ప్రభుత్వం శుభవార్త చెప్పనుంది. సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ఆర్థికశాఖ ప్రణాళికలు రూపొందిస్తున్నట్టుగా సమాచారం. ఈ నేపథ్యంలోనే త్వరలోనే రెండు పెండింగ్ డిఏలను ప్రకటించి ఉద్యోగులకు దసరా కానుకను అందించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టుగా తెలిసింది. ఆ దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్టుగా సమాచారం. ఈ నెలఖారులోగా రెండు డిఏలకు సంబంధించి నిధులు సమీకరించాలని సిఎం రేవంత్ రెడ్డి ఆర్థిక శాఖను ఆదేశించినట్లుగా ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

## నేడు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

రుణమాఫీపై నిర్ణయం

వరదలపై కేంద్ర సాయానికి వినతిపత్రం



2లో.

## ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం

వచ్చే నెలాఖరులోగా ప్రారంభించాలి

అధికారులకు సిఎస్ శాంతికుమారి ఆదేశం



2లో.



## హెల్త్ హబ్‌గా వరంగల్

- అందుబాటులోకి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు
- వైద్య సేవలకు హైదారాబాద్ వెళ్లాల్సిన అవసరం లేదు
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

3లో.



## అధిష్ఠానం కోరుకున్నట్టు నడుచుకుంటా

: మహేశ్ కుమార్ గౌడ్

వెనుకబడిన వర్గాల విషయంలో ఎక్కడా తగ్గేది లేదన్న మహేశ్ కుమార్ గౌడ్

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు బీసీల గురించి మాట్లాడే అర్హత లేదని వ్యాఖ్య

రాజీవ్ విగ్రహాన్ని తొలగిస్తామన్న కేటీఆర్ వ్యాఖ్యలను తప్పుపట్టిన పీసీసీ చీఫ్

2లో.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం

### వచ్చే నెలాఖరులోగా ప్రారంభించాలి

### అధికారులకు సిఎస్ శాంతికుమారి ఆదేశం

హైదరాబాద్ సెప్టెంబర్ 19,ప్రజావినికిడి: కొడంగల్, మధిర నియోజకవర్గం, లక్ష్మీపురం గ్రామంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణ పనులను వచ్చే నెలాఖరులోగా ప్రారంభించాలని అధికారులను సిఎస్ శాంతికుమారి ఆదేశించారు. గురువారం సచివాలయంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పర్యవేక్షణ కోసం ఏర్పాటైన మేనేజ్‌మెంట్ కమిటీ మొదటి సమావేశం జరిగింది. సమావేశానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కొడంగల్, మధిర నియోజకవర్గం, లక్ష్మీపురం గ్రామంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణ పనులను వచ్చే నెలాఖరులోగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పరిపాలనా అనుమతుల కోసం ప్రతిపాదనలు సమర్పించేందుకు అనుసరించాల్సిన విధానాలు, ప్రతిపాదనల ప్రక్రియకు నోడల్ విభాగం ఖరారుపై చర్చించారు. సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలల నిర్వహణ, రెసిడెన్షియల్ పాఠశాలలకు భూములు కేటాయించడంపై సమావేశంలో చర్చించారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణ పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రతివారం సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. ప్రభుత్వ సలహాదారు శ్రీనివాస్‌రాజు, ముఖ్య కార్యదర్శులు నవీన్ మిట్టల్, బి వెంకటేశం, సందీప్ కుమార్ సుల్తానియా, శ్రీధర్, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణభాస్కర్, ఇతర ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

# గోవాలో జానీ మాస్టర్ అరెస్టు

హైదరాబాద్ సెప్టెంబర్ 19,ప్రజావినికిడి: అత్యాచార ఆరోపణలు ఎదుర్కొంటున్న టాలీవుడ్ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ అలియాస్ షేక్ జానీ బాషను సైబరాబాద్ ఎస్ఓటి పోలీసులు గురువారం అరెస్టు చేశారు. గోవాలోని లాడ్జిలో జానీ మాస్టర్‌ను అదుపులోకి తీసుకున్న ఎస్ఓటి పోలీసులు అక్కడి కోర్టులో హాజరు పర్చి నగరానికి తీసుకుని వస్తున్నారు. పోలీసులు జానీ మాస్టర్‌ను నేరుగా ఉప్పర్‌పల్లి కోర్టులో హాజరుపర్చే అవకాశం ఉంది. జానీ మాస్టర్ తనపై లైంగిక వేదింపులకు పాల్పడ్డాడంటూ ఆయన వద్ద అసిస్టెంట్‌గా పనిచేస్తున్న యువతి(21) ఇటీవల నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. 2017లో జానీ మాస్టర్ పరిచయమయ్యాడని, 2019లో అతని బృందంలో సహాయ నృత్య దర్శకురాలిగా చేరానని యువతి తెలిపింది. ముంబయిలో ఓ సినిమా చిత్రీకరణ నిమిత్తం జానీ మాస్టర్‌తోపాటు తాను, మరో ఇద్దరు సహాయకులం వెళ్లామని, అక్కడ హోటల్లో తనపై జానీ మాస్టర్ అత్యాచారానికి పాల్పడ్డాడని ఫిర్యాదు చేసింది. ఈ విషయం ఎవరికైనా చెబితే పని నుంచి తొలగిస్తానని. సినిమా పరిశ్రమలో ఎప్పటికీ పని చేయలేవని బెదిరించాడు.



దీన్ని అవకాశంగా తీసుకుని.. హైదరాబాద్ నుంచి ఇతర నగరాలకు సినిమా చిత్రీకరణకు తీసుకెళ్లిన సందర్భాల్లో పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడని తెలిపింది. లైంగిక వాంఛ తీర్చనందుకు ఒకసారి జుట్టు పట్టుకుని తలను అద్దానికి కొట్టాడని, మతం మారి తనను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేసేవాడని, వేధింపులు భరించలేక జానీ మాస్టర్ బృందం నుంచి బయటకొచ్చేశానని తెలిపింది. సొంతంగా పనిచేసుకోనివ్వకుండా, ఇతర ప్రాజెక్టులు రాకుండా ఇబ్బందిపెట్టాడని, ఆగస్టు 28న తమ ఇంటి గుమ్మానికి గుర్తుతెలియని వ్యక్తులు ఓ పార్సిల్ వేలాడదీశారని, అందులో 'మగబిడ్డకు అభినందనలు. కానీ జాగ్రత్తగా ఉండు' అని రాసి ఉంది' అని ఫిర్యాదులో బాధితురాలు పేర్కొంది. మైనర్‌గా ఉన్నప్పటి నుంచే తనపై అత్యాచారం చేస్తున్నాడని బాధితురాలు ఫిర్యాదు చేయడంతో జానీ మాస్టర్‌పై పోక్సో కేసు నమోదు చేశారు. కేసు నమోదైనప్పటి నుంచి పరారీలో ఉన్న జానీ మాస్టర్ పోలీసుల అరెస్టు నుంచి తప్పించుకునేందుకు ప్లాన్ వేశాడు. లద్దాఖ్‌లో ఉన్నట్లు తెలియడంతో అక్కడికి వెళ్లిన సైబరాబాద్ పోలీసులకు చిక్కకుండా పరారయ్యాడు. అప్రమత్తమైన పోలీసులు వెంటాడి గోవాలో పట్టుకున్నారు. జానీ మాస్టర్‌ను పట్టుకోవడం కోసం నాలుగు బృందాలు వివిధ ప్రాంతాలకు వెళ్లాయి.

**అణగదొక్కాలని ఇరికించారు: అయేషా, జానీ బాష భార్య**

తన భర్త కేరీర్‌లో ఎదుగుతున్నాడని, జాతీయ అవార్డు వచ్చినప్పటి నంచి జానీ మాస్టర్‌పై కుట్రలు పన్నుతున్నారని అతడి భార్య అయేషా తెలిపారు. ఆమె గురువారం నార్సింగి పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ అరెస్టుపై స్పందించేందుకు ఆయన భార్య సుమలత నిరాకరించారు. ఓ ఫేక్ కాల్ వచ్చిందని, దానిపై ఆరా తీసేందుకు పోలీస్ స్టేషన్‌కు వచ్చినట్లు తెలిపింది.

# త్వరలోనే ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

(మొదటి పేజి తరువాయి)

పెండింగ్‌లో ఉన్న డిఏలను విడుదల చేయాలని ఉద్యోగ సంఘాలు కొన్ని రోజులుగా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్న నేపథ్యంలో ఈ మేరకు ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన త్వరలోనే వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

**ప్రతినెలా రూ.4,800 కోట్ల జీతాలు చెల్లింపులు**

ప్రస్తుతం ఉద్యోగులకు సంబంధించి నాలుగు డిఏలు (జూలై- టు డిసెంబర్ 2022, జనవరి- టు జూన్ 2023), 'జూలై- టు డిసెంబరు 2023, జనవరి- టు జూన్ 2024)లు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే అందులో రెండింటిని ఉద్యోగులకు ఇప్పించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టుగా తెలిసింది. దీనికి సంబంధించి ప్రభుత్వంపై ఎంత ఆర్థికభారం పడుతుందన్న విషయాన్ని ఇప్పటికే ఆర్థికశాఖ ప్రభుత్వానికి నివేదిక అందించినట్టుగా సమాచారం. గత ప్రభుత్వంలో 2022 జూలై నుంచి ఉద్యోగుల డిఏ (కరువు భత్యం)లు పెండింగ్‌లో ఉన్నాయి. మొత్తంగా నాలుగు డిఏలను ఉద్యోగులకు ప్రస్తుతం ఇవ్వాల్సి ఉండగా త్వరలోనే మరో డిఏ డబ్బులు కూడా ఉద్యోగులకు చెల్లించాల్సి రావడం, మొత్తంగా డిఏల సంఖ్య ఐదుకు చేరుకుంటుందని, ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం రెండు డిఏలను చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టుగా తెలిసింది. ప్రస్తుతం ఈ రెండు డిఏలను ఉద్యోగులకు చెల్లిస్తే ప్రభుత్వంపై రూ.300 కోట్ల భారం పడుతుందని ఆర్థిక శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే ఉద్యోగుల జీతాలు, రిటైర్డ్ ఎంప్లాయిస్ పెన్షన్ల కోసం దాదాపు రూ.4,800 కోట్లను ప్రతి నెలా ప్రభుత్వం ఖర్చు చేస్తుండగా రెండు డిఏల చెల్లింపుతో మరో రూ.300 కోట్ల అదనపు భారం ప్రభుత్వంపై పడనుంది.

### జూలై- టు డిసెంబర్ 2022, జనవరి- టు జూన్ 2023

ఈ నేపథ్యంలో అక్టోబర్ 01వ తేదీ లేదా నవంబర్ 01వ తేదీన ఉద్యోగులకు అందించే జీతంలో ఈ రెండు డిఏలను కలిపి ఇచ్చే అవకాశం ఉందని తెలిసింది. సిఎం, డిప్యూటీ సిఎంలను వేర్వేరు సందర్భాల్లో కలిసిన ఉద్యోగ సంఘాల ప్రతినిధులు వారు ఎదుర్కొంటున్న పలు సమస్యలను రాతపూర్వకంగా తెలియజేయడమే కాకుండా నాలుగు పెండింగ్ డిఏల గురించి కూడా ప్రస్తావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఉద్యోగులు దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న రెండు డిఏలను (జూలై- టు డిసెంబర్ 2022, జనవరి- టు జూన్ 2023)లకు సంబంధించిన డిఏలను ప్రభుత్వం ప్రస్తుతం విడుదల చేయాలని నిర్ణయించినట్టుగా తెలిసింది. జూలై- టు డిసెంబర్ 2022, జనవరి- టు జూన్ 2023 డిఏలను 3.64 శాతంగా గత ప్రభుత్వం ప్రకటించింది. కానీ, వాటిని అమలు చేయకుండా గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టడంతో ప్రస్తుతం వాటిని విడుదల చేసే అవకాశం ఉందని తెలిసింది. (జూలై- టు డిసెంబర్ 2022, జనవరి- టు జూన్ 2023) ఈ రెండడు డిఏలను క్లియర్ చేస్తే ఇంకా జూలై- టు డిసెంబర్ 2023, జనవరి- టు జూన్ 2024 పెండింగ్‌లో ఉంటాయి. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి డిఏ చెల్లించాల్సి ఉండగా, బిఆర్ఎస్ హయాంలో మూడు డిఏలు, కాంగ్రెస్ అధికారం చేపట్టాక ఒక డిఏ పెండింగ్‌లో ఉంది.

# నేడు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

హైదరాబాద్‌సెప్టెంబర్ 19,ప్రజావినికిడి: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన నేడు సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ సమావేశం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ రుణమాఫీని సంపూర్ణంగా అమలు చేయడం, పంటల బీమా, రైతు భరోసా, హైడ్రాకు చట్టబద్ధత కల్పించే ఆర్డినెన్స్ జారీకి ఆమోదం తెలుపనున్నారు. దీంతో పాటు వివిధ అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. చెరువుల పరిరక్షణకు ఏర్పాటు చేసిన హైడ్రా ఇప్పటివరకు 99 జీఓ ద్వారా మాత్రమే కొనసాగుతోంది. ఈ సంస్థ ఎఫ్‌టిఎల్ ఉన్న ఆక్రమణలను తొలగిస్తుంటే కొందరు అడ్డుకొని హైడ్రాకు కూల్చివేతల అధికారం లేదంటూ హైకోర్టును ఆశ్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో హైడ్రాకు చట్టబద్ధత కల్పించే ఆర్డినెన్స్ అంశంపై మంత్రిమండలి నిర్ణయం తీసుకోనుంది.




రాష్ట్రంలో రూ.2 లక్షల వరకు ఉన్న పంట రుణమాఫీని ప్రభుత్వం చేపట్టింది. రూ.2 లక్షల కంటే ఎక్కువ మొత్తంలో ఉన్న రుణాలు ఇంకా మాఫీ కాలేదు. దీంతో వారికి దశల వారీగా మాఫీ చేయడానికి ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకు కేబినెట్ ఆమోదం కావాలి. రైతుబంధు స్థానంలో రైతుభరోసాను పంట పెట్టుబడుల కోసం ప్రవేశపెట్టనుంది. దీనికి సంబంధించిన అమలు, పరిమితులపై జిల్లాల వారీగా అభిప్రా యాలు సేకరణ చేపట్టనుంది. ప్రస్తుతం వానాకాలం పంట ముగింపు దశకు చేరుతున్నందున వెంటనే పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి వస్తోంది. ఈ మేరకు పంటలు వేసిన వారికే సాయం చేస్తామని ఇప్పటికే వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల తెలిపారు. దీనిపై మంత్రిమండలి చర్చించి నిర్ణయం తీసుకోనుంది. కేంద్ర ప్రభుత్వ పంటల బీమా పథకాన్ని రాష్ట్రంలోనూ అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రంలో కులగణనను మూడు నెలల్లో పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశించింది. స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఈ కులగణన చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు కులగణనకు సంబంధించిన సర్వే మార్గదర్శకాలు మంత్రిమండలి భేటీలో ఆమోదించనుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు తీవ్రంగా నష్టపోయాయి. నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో ప్రజలు ముంపుతో భారీగా నష్టపోయారు. ఇప్పటికే రూ.10 వేల కోట్లకు పైగా నష్టాన్ని ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ మేరకు కేంద్ర బృందం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించింది. నష్టాన్ని చూసింది. దీనిపై కేంద్రం విదారంగా సాయం చేయాలని మంత్రిమండలి తీర్మానం చేయనుంది. పేద కుటుంబాలకు రేషన్ కార్డుల జారీలో పారదర్శకతను పెంచడానికి ఇప్పటివరకున్న అర్హతలను సవరించాలన్న ప్రతిపాదనపై మంత్రిమండలి సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. రేషన్‌కార్డులతో సంబంధం లేకుండానే సాధారణ ప్రజలకు ఆరోగ్యశ్రీ సేవలను సులభంగా అందించడానికి ఆరోగ్య కార్డుల జారీకి ఆమోదం తెలుపనున్నట్లుగా సమాచారం.

# అధిష్ఠానం కోరుకున్నట్టు నడుచుకుంటా

### పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్

హైదరాబాద్ సెప్టెంబర్ 19,ప్రజావినికిడి: 'బీసీల కోసం రాహుల్‌గాంధీ వదిలిన బాణాన్ని నేను.. సోనియాగాంధీ వదిలిన సందేశాన్ని.. ఖర్గే పంపిన సైనికుడిని..' అని పీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. భవిష్యత్తులో బీసీలకు రావాల్సిన హక్కుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. గురువారం హైదరాబాద్ రవీంద్రభారతిలో కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు అధ్యక్షతన ఓబీసీ సంఘాల ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. దేశంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు న్యాయం జరగాలని భారత్ జోడో యాత్రలో 'జిస్‌కీ జిత్నీ అబాదీ.. ఉత్నీ హి భాగిదారి' అని రాహుల్ నినదించారు కాబట్టే ఇప్పుడు ఆయన్ని చంపేస్తామంటూ బెదిరిస్తున్నారన్నారు.



భారాస పదేళ్ల పాలనలో బీసీల కోసం ఒక్క కార్యక్రమం చేయలేదన్నారు. బీసీల మీద ప్రేమ ఉంటే భారాస రాష్ట్ర అధ్యక్షుడిగా బీసీని నియమించాలని సవాలు విసిరారు. భాజపా కూడా అగ్రవర్ణ నాయకుడిని అధ్యక్షుడిగా చేసిందన్నారు. తన పీసీసీ కమిటీలో 60% బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు అవకాశం కల్పిస్తానని చెప్పారు.

రాష్ట్రంలో జనగణన జరిగిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహిస్తామని తెలిపారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. పీసీసీ పదవికి మహేశ్‌కుమార్‌గౌడ్ వన్నె తెస్తారన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. కులగణనకు సంబంధించి కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు వినోద్, వీర్లపల్లి శంకర్, రాజ్ ఠాకూర్, ఎమ్మెల్సీలు అమీర్ అలీఖాన్, యెగ్గె మల్లేశం, మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు నిర్మలా జగ్గారెడ్డి, అనిల్, శివసేనారెడ్డి, మెట్టు సాయికుమార్, కాల్వ సుజాత, చల్లా నరసింహారెడ్డి, ఎం.వీరయ్య, డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, మాజీమంత్రి శంకర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ తదితరులు ఉన్నారు.

# నైపుణ్య శిక్షణకు పెద్దపీట

(మొదటి పేజి తరువాయి)

రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ఆ బాధ్యతను యూనివర్సిటీ బోర్డుకు అప్పగిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలు, ప్రముఖ కంపెనీలు ఈ యూనివర్సిటీలో భాగస్వామ్యం పంచుకోవాలని, యువతకు నైపుణ్యాలు నేర్పించి ఉపాధి కల్పించేందుకు తమ వంతు సహకారం అందించాలని ఆయన పిలుపునిచ్చారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ బోర్డుతో పాటు రాష్ట్రంలోని వివిధ రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సచివాలయంలో గురువారం సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తరపున యూనివర్సిటీకి 150 ఎకరాల స్థలంతో పాటు రూ.100 కోట్లు కేటాయించినట్లు ఆయన చెప్పారు. రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలు స్కిల్ యూనివర్సిటీ లో భాగస్వామ్యం పంచుకోవాలని, యూనివర్సిటీ పూర్తి స్థాయి నిర్వహణకు కార్పస్ ఫండ్ ఏర్పాటుకు ముందుకు రావాలని ఆయన కోరారు. యూనివర్సిటీలో భవనాల నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. తమ కంపెనీల పేర్లను లేదా దాతల పేర్లను ఈ భవనాలకు పెట్టాలని అధికారులకు ఆయన సూచించారు. వీలైనంత వేగంగా తమ ఆలోచనలను ఆచరణలోకి తెచ్చామని, ఇకపై యూనివర్సిటీ బాధ్యతను బోర్డు ఛైర్మన్ మహీంద్రా ఆనంద్‌కు అప్పగిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

ఈ రంగంలో అనుభవంతో పాటు ప్రత్యేక గుర్తింపు ఉన్న మహీంద్రా ఆనంద్ స్కిల్ యూనివర్సిటీకి తన బ్రాండ్ ఇమేజీని తీసుకువస్తారన్న నమ్మకం ఉందని ఆయన అన్నారు. తమ ప్రభుత్వం ఇప్పటి నుంచి యంగ్ ఇండియా స్పోర్ట్ యూనివర్సిటీ ఏర్పాటుపై దృష్టి సారిస్తుందని ఆయన చెప్పారు. దాదాపు 200 ఎకరాల్లో స్పోర్ట్ యూనివర్సిటీ నెలకొల్పి 2028 ఒలింపిక్స్‌లో ఇండియాకు గోల్డ్ మెడల్ తీసుకురావాలన్న లక్ష్యంతో క్రీడాకారులకు శిక్షణను అందిస్తామన్నారు. ఈ యూనివర్సిటీ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని ముఖ్యమంత్రి పారిశ్రామికవేత్తలకు సిఎం పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వానికి నిధుల ఇబ్బంది లేదని, రూ. 3 లక్షల కోట్ల బడ్జెట్‌లో వెయ్యి కోట్లు ఖర్చయినా భరించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన చెప్పారు. ఆర్థిక సహకారానికి మించి, రాష్ట్రంలోని అందరూ పారిశ్రామికవేత్తలు, వ్యాపార వాణిజ్యవేత్తలు ఆశించినంత చొరవ ప్రదర్శించాలని తగిన భాగస్వామ్యం, బాధ్యతలను పంచుకోవాలని ఆయన కోరారు.

**అర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సిటీ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం: మంత్రి శ్రీధర్‌బాబు**

ఈ సందర్భంగా యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి సంబంధించి కీలక అంశాలను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పారిశ్రామికవేత్తలకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి ఆకర్షణీయ గమ్య స్థానంగా తీర్చిదిద్దేందుకు కంకణం కట్టుకుందని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఇందులో భాగంగా కొత్తగా ఫ్యూచర్ సిటీని నెలకొల్పుతున్నామని, ఇప్పటికే అర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సిటీ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయన్నారు. ముఖ్యమంత్రి స్వీయ ఆలోచనతో త్వరలోనే స్కిల్ యూనివర్సిటీ లో కొత్త కోర్సులు ప్రారంభమవ్వటం ఆనందంగా ఉందన్నారు.

**తెలంగాణకు సత్తా ఉంది: ఆనంద్ మహీంద్రా**

తెలంగాణకు సత్తా ఉందని ఆనంద్ మహీంద్రా పేర్కొన్నారు. తెలంగాణలో నైపుణ్యం కలిగిన యువతను ప్రపంచానికి అందించాలన్న ముఖ్యమంత్రి ఆలోచన గొప్పదని యూనివర్సిటీ బోర్డు ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా ప్రశంసించారు. మంచి విజన్ ఉన్న సమర్థ నాయకుడు సిఎం రేవంత్ రెడ్డి అంటూ కొనియాడారు. అందుకే యూనివర్సిటీ బోర్డు ఛైర్మన్‌గా ఉండాలని సిఎం కోరగానే ఒప్పుకోవాల్సి వచ్చిందని ఆనంద్ మహీంద్రా అన్నారు. సాధారణంగా ప్రభుత్వాలు సబ్సిడీలు, ఆకర్షణీయ పథకాలకు ఎక్కువ ప్రాధాన్యమిస్తాయని, కానీ, యువతను నిపుణులుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి ఆలోచించిన తీరులోనే దార్శనికత ఉందని ఉందని ఆయన అభినందించారు. తెలంగాణలోనే అతి పెద్ద యూఎస్ కాన్సులేట్ ఉందని, ఎక్కువ మంది ఇక్కడి నుంచే అమెరికాకు వెళుతున్నారని ఆయన గుర్తు చేశారు. అలాంటప్పుడు ప్రపంచానికి నైపుణ్యమున్న యువతను అందించే గమ్యస్థానంగా తెలంగాణ నిలబడుతుందనడంలో సందేహం లేదన్నారు. ముఖ్యమంత్రి కల నిజం కావాలని, ఆయన ఆశయం నెరవేరాలన్న ఆకాంక్షను ఆయన వ్యక్తం చేశారు.

తొలి ఏడాది రెండు వేల మందికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, యూనివర్సిటీ బోర్డు ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా, కో ఛైర్మన్ శ్రీనిరాజు, బోర్డు సభ్యులు పి.దేవయ్య, సుచిత్రా ఎల్లా, సతీష్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సిఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సిఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డితో పాటు ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. బోర్డు సభ్యులు మనీష్ సభర్వాల్, సంజీవ్ బిక్చందానీ, ఎంఎం మురుగప్పన్, డాక్టర్ కెపి కృష్ణన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు.

**సమావేశంలో ఎపి సిఎం కోడలు**

ఎపి సిఎం చంద్రబాబు కోడలు, మంత్రి నారా లోకేష్ సతీమణి నారా బ్రాహ్మణి కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. అయితే, నారా బ్రహ్మణి హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. అయితే, తెలంగాణలో ఏర్పాటు చేయబోయే స్కిల్ యూనివర్సిటీలో భాగంగా ఆమె చర్చల్లో పాల్గొనడం ఆసక్తిగా మారింది. కాగా, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఈ ఏడాది దసరా నుంచి ఆరు కోర్సులతో తరగతులు ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. రంగారెడ్డి జిల్లా ముచ్చర్ల వద్ద 57 ఎకరాల స్థలంలో స్కిల్ వర్సిటీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

# హెల్త్ హబ్‌గా వరంగల్

## - వైద్య సేవలకు హైదరాబాద్ వెళ్లాల్సిన అవసరం లేదు

### - రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

**వరంగల్ సెప్టెంబర్ 19,ప్రజావినికిడి:** ఇక నుంచి వైద్య సేవల నిమిత్తం హైదరాబాద్ వెళ్లనవసరం లేకుండా వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణ కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. వరంగల్ జిల్లాలో 183 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రి, వైద్య కళాశాలను గురువారం రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సిలారపు దామోదర రాజనర్సింహ, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖలతో కలసి ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ రాంచంద్రు నాయక్, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు డాక్టర్ మురళి నాయక్, కుడా చైర్మన్ ఇనగల వెంకట్రామి రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి, డిఎంఈ వాణి, ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ చైర్మన్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళ క్యాంటీన్ మంత్రులు ప్రారంభించి, తయారుచేసిన వివిధ రకాల చిరుతిండ్ల రుచులు చూసారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రాంగణంలో మంత్రులు మొక్కలు నాటారు. 2 కోట్ల విలువైన బ్యాంకు లింకేజి చెక్కును మంత్రులు15 స్వయం సహాయక సంఘాలకు అందజేశారు. నర్సంపేట మండలంలోని రాజుపేటలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎస్డిఎఫ్ నిధుల కింద, 2 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించే బంజారా భవన్ నిర్మాణ పనులకు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర నరసింహ, కొండ సురేఖ, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ లు శంకుస్థాపన చేశారు. నర్సంపేట పురపాలక సంఘం ఆధ్వర్యంలో అమృత్ 2.0 పథకం కింద 2 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టే 600 కేఎల్ఈఎల్ఎస్ ఆర్ నిర్మాణం, అంతర్గత పైప్ లైన్లు పనులకు మంత్రులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ ఏ ప్రభుత్వానికైనా మొదటి ప్రాధాన్యంగా తీసుకోవాల్సింది విద్య, వైద్యం అన్నారు. అవి అమలుపరిచే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. నర్సంపేట వైద్య కళాశాల ఆసుపత్రిని 183 కోట్ల నిర్మాణ వ్యయంతో ప్రారంభించుకుంటున్నాం. గత ప్రభుత్వం కేవలం ఎన్నికల హామీగా మాత్రమే ఇచ్చిన ఈ వైద్య కళాశాల, ఆసుపత్రిని కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసి, ఆచరణలో నిజం చేసి చూపిందన్నారు. మెడికల్ కళాశాల 50 సీట్లతో సంపూర్ణంగా వైద్య సేవలు ఈ ప్రాంతవాసులు వినియోగించుకునేలాగా అందుబాటులోకి తీసుకొచ్చామని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు జిల్లావాసులు అత్యవసర సమయంలో హైదరాబాద్ వెళ్లే అవసరం లేకుండా, అత్యాధునిక అంబులెన్సులు, డ్రామా సెంటర్, కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ సెంటర్, ఐ వి ఎఫ్ సెంటర్, పీడియాట్రిక్ సెంటర్, క్యాన్సర్ సెంటర్ లాంటి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలన్నీ, రానున్న రోజుల్లో వరంగల్ తీసుకువచ్చి, వరంగల్ ను హెల్త్ హబ్ గా మారుస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 4 వేల వైద్య ప్రొఫెసర్లు, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ల ఖాళీలు భర్తీ చేశామని వెల్లడించారు. త్వరలో వరంగల్ లో 30 కొట్లతో కాన్సర్ ట్రామ సెంటర్ ఏర్పాటు చేస్తామని అన్నారు. అలాగే 7వేల మంది కి నర్సింగ్ పోస్టులు ఇచ్చి, త్వరలో ఇంకో 2500 మందికి పోస్టింగ్ ఇచ్చే దిశగా నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. సామాన్య ప్రజలకు ఇక్కడి నుంచైనా 20 నుంచి 45 నిమిషాల్లో వైద్య చికిత్స అందే విధంగా ప్రాథమిక, ఏరియా మరియు డిస్టిక్ హాస్పిటల్ ను నిర్మించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సామాన్య ప్రజలకు వైద్యం అందుబాటులోకి వచ్చే విధంగా 108, 104,102 ఆరోగ్యశ్రీ ట్రస్టు లాంటి కాంగ్రెస్ ప్రభుత్వమే ఏర్పాటు చేసింది. అలాగే 2004 నుండి ఇప్పటివరకు ట్రీట్మెంట్ ప్రొసీజర్ చార్జెస్ గత ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా పెంచలేదు. కానీ మా ప్రభుత్వం ఏర్పాటు కాగానే 40 శాతం పెంచింది. దానికోసం 4,000 కోట్ల రూపాయలు అదనంగా ఖర్చు చేశామన్నారు. యాక్సిడెంట్లు జరిగిన ఒక గంట (గోల్డెన్ అవర్) లో వైద్యం అందించే విధంగా తెలంగాణ వ్యాప్తంగా ట్రామా సెంటర్లను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. త్వరలో కొత్తగా 2000 కోట్లతో 31 వారాల్లో ఉస్మానియా ఆసుపత్రిని కొత్తగా నిర్మించబోతున్నామని తెలిపారు.

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ**

రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యా రంగాలకు పెద్ద పీట వేస్తున్నదని అన్నారు.160 పడకల జిల్లా ఆసుపత్రిని, ఆసుపత్రి ప్రారంభించడం జరిగిందని, మెడికల్ కళాశాలలో మొదటి బ్యాచ్ లో 50 మంది అడ్మిషన్లు అయినాయని, త్వరలో వైద్య తరగతులు ప్రారంభమవుతాయని అన్నారు. కళాశాలకు కావలసిన అన్ని ఫ్యాకల్టీ లను రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేతల ప్రభుత్వమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా చేస్తున్నదని అన్నారు.రాజీవ్ ఆరోగ్య శ్రీ కార్యక్రమంలో నిరుపేదలకు 10 లక్షలు వైద్య ఖర్చులకోసం ఉచితంగా ఇందిరమ్మ ప్రభుత్వం అందిస్తున్నదని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు వేసి సుమారు 657 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టే ప్రభుత్వ పాఠహశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించినట్లు, విద్య పట్ల ఈ ప్రభుత్వం చిత్తశుద్ధి ఎలా ఉందో ఈ విద్య సంవత్సరం నుండి ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. 199 నియోజక వర్గాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మించాలని ఒక్కొక్క ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ 100 నుండి రూ.110 కోట్లు తో 25 ఎకరాలలో అన్ని కులాలకు,అన్ని వర్గాల సంబంధించిన వారిని హాస్టల్స్,స్కూల్స్ లతో ఇంటిక్రెటీటెడ్ స్కూళ్లలో ఉండే విధంగా అతి కొద్ది రోజుల్లోనే రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం ఎంతో గొప్పగా ప్రచారం చేసుకున్న మిషన్ భగీరథలో భారీ అవినీతి, అక్రమాలు జరిగాయని, 46 వేల కోట్ల రూపాయల ఈ ప్రాజెక్టులో 15 వేల నుండి 20 వేల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మిషన్ భగీరథపై సర్వే నిర్వహించగా 53 శాతం ఇండ్లకు మంచినీరు అందడం లేదని భయంకరమైన విషయాలు వెలుగు చూసాయని వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ మిషన్ భగీరథ కార్యక్రమాన్ని ప్రజలకోసం చేసినట్టుగా లేదని, వారి జేబులు నింపుకోవడానికి చేసినట్టుగా ఉందని విమర్శించారు. వాస్తవాలను ప్రజలకు



తెలియజేసి ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి మంచినీరు అందిస్తామని ప్రకటించారు. గత పదేండ్లలో ఎన్నడూ లేని విధంగా వ్యవసాయానికి బడ్జెట్ లో రూ.72 వేల కోట్లు కేటాయించిన ఘనత ఈ ప్రభుత్వానిది. 27 రోజుల్లో 23 లక్షల మందికి రూ. 18 వేల కోట్ల రైతు రుణాలను రద్దు చేశామని సాంకేతిక కారణాలతో కొంతమంది రైతులకు రుణమాఫీ ప్రయోజనం అందలేదని వీలైనంత త్వరలో వాటిని పరిష్కరించి ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన ప్రతి రైతన్నకు రుణమాఫీ చేస్తామని, అన్న మాట ప్రకారం 31 వేల కోట్ల రూపాయలకి ఇంకా కావాలంటే రెండు మూడు వందల కోట్లు ఎక్కువైనా పర్వాలేదు అర్హులైన ప్రతి రైతన్నకి ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో రెండు లక్షల రూపాయలు వరకు రుణమాఫీ చేసి తీరుతుందన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ హెల్త్ కార్డులు, రేషన్ కార్డులు వేరు వేరుగా అందించబోతున్నామని ప్రకటించారు. మరి కొద్ది రోజుల్లో ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గు వేయబోతున్నామని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని వెల్లడించారు.

**మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ**


నిరుపేదలకు వైద్యం అందించే దిశగా ఒక మారుమూల ప్రాంతంలో మెడికల్ కాలేజీని ప్రభుత్వం తరఫున ప్రారంబించుకోవడం ఆనందంగా ఉందని మంత్రి కొండా సురేఖ అన్నారు. గతంలో వైద్యాన్ని పట్టించుకునేవారు కాదు. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి ఉన్నప్పుడు 104,108 సర్వీసు లు తెచ్చి, ఎంతో మంది నిరుపేద కుటుంబాలలో వెలుగులు నింపి, అదే స్ఫూర్తితో రేవంత్ రెడ్డి వైద్య, విద్య,అభివృద్ధి, సంక్షేమం పైన దృష్టి పెట్టారన్నారు. మహిళలు సాధికారతతో స్త్రీ శక్తి మహిళా క్యాంటీన్ ప్రారంభించుకోవడం జరుగుతుందని అన్నారు. మహిళలను ఆర్థిక సాధికారతతో ముందుకు తీసుకు వెళుతున్న ఘనత ముఖ్యమంత్రిదేనని అన్నారు. వరంగల్ ఎంజీఎంలో ఖమ్మం నుండి కుండా వైద్య సదుపాయాల కోసం వరంగల్ కి వస్తున్నారని, గత ప్రభుత్వం ఎంజీఎంను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని అన్నారు. నర్సంపేటలో ఏర్పాటు చేసిన ఆసుపత్రిని చూసినట్లయితే పకృతి పరవశించేలా, ఒక మంచి వాతావరణంలో హాస్పిటల్ నిర్మించడం వలన రోగులకు ఎంతో మనశ్శాంతిగా ఉంటుందని, రోగాన్ని కూడా నిర్మూలించుకోగలిగిన శక్తి సామర్థ్యాలు ఒక రోగికి వాతావరణం కల్పిస్తుందని వారన్నారు. మహిళలకి ఉచిత బస్సును, గ్రామీణ ప్రాంతాల ప్రజలు వారి వృత్తి రీత్యా అనారోగ్య రీత్యా అవసరాల నిమిత్తం ఫ్రీ బస్సును వినియోగిస్తున్నారని తెలిపారు. నిరుపేద ప్రజలకు అన్ని విధాల ఆదుకునే విధంగా ఈ ప్రభుత్వం ముందుకు వెళుతుందని అందుకు అధికార యంత్రాంగం ప్రజా ప్రతినిధులుగా వారంతా ముందుండి కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరే విధంగా కృషి చేస్తామని ఈ సందర్భంగా మంత్రి ప్రజలకి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా, మండల స్థాయి అధికారులు, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోండి

## ఖర్గే, రాహుల్‌లకు హరీశ్‌రావు బహిరంగ లేఖ

హైదరాబాద్ సెప్టెంబర్ 19,ప్రజావినికిడి:: కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి అసభ్యకరమైన భాష ఉపయోగిస్తున్నారని, అలాంటి నేరపూరిత వ్యాఖ్యలను అరికట్టడంలో కాంగ్రెస్ అధిష్ఠానం విఫలమైందని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు విమర్శించారు.ఆ పార్టీ తాను చెప్పే నీతులనే పాటించకపోవడం ద్వంద్వప్రమాణాలకు నిదర్శనమన్నారు. రేవంత్‌రెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీలకు హరీశ్‌రావు గురువారం బహిరంగ లేఖ రాశారు. “మాజీ సీఎం కేసీఆర్‌ను దూషించడం, ఆయనపై కించపరిచే వ్యాఖ్యలు చేయడం రేవంత్ దిగజారుడుతనానికి నిదర్శనం. రాహుల్ గాంధీపై భాజపా నేత చేసిన వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని కాంగ్రెస్ పిలుపునిచ్చింది.అలాంటి దూషణలే కాంగ్రెస్ సీఎం రేవంత్‌రెడ్డి చేస్తోంటే.. ఆ పార్టీ అధిష్ఠానం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? హింసాత్మక వ్యాఖ్యలు, జర్నలిస్టులపై దాడులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని





ప్రకటించిన రాహుల్ గాంధీ ఎందుకు స్పందించడం లేదు? ప్రజాస్వామ్యాన్ని పాతరేస్తున్న రేవంత్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం” అని హరీశ్‌రావు పేర్కొన్నారు. రుణమాఫీ కాలేదన్న ఆవేదనతో అన్నదాతలు సంఘటితమై ‘చలో ప్రజాభవన్’కు పిలుపునిస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి వణుకు పుట్టిందని మరో ప్రకటనలో హరీశ విమర్శించారు. రుణమాఫీ కోసం పోరుబాట పట్టిన రైతన్నలను అరెస్టు చేయడం దుర్మార్గమని, దీన్ని భారాస పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

# జమిలి ఎన్నికల నిర్వహణకు కమిటీ


## త్వరలో కేంద్రం ఏర్పాటు చేస్తుందన్న కిషన్‌రెడ్డి



న్యూఢిల్లీ:సెప్టెంబర్ 19,ప్రజావినికిడి:2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా నిలపాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రనిచేస్తోందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు.జమిలి ఎన్నికలు నిర్వహించాల ని నిర్ణయించడం స్వాగతించదగిన పరిణామమన్నారు. జమిలి ఎన్నికల విషయంలో కేబినెట్ నిర్ణయంపై దేశవ్యాప్తంగా చర్చకు ప్రోత్సహించడం, జమిలి ఎన్నికల నిర్వహణ అమలు కోసం కేంద్రం ఓ కమిటీని కూడా ఏర్పాటు చేస్తుందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రస్తుతం జమిలి ఎన్నికలను వ్యతిరేకిస్తున్న పార్టీలు కూడా త్వరలోనే దీనికి సహకరిస్తాయనే విశ్వాసం తనకుందని తెలిపారు.దేశవ్యాప్తంగా ఐదేళ్లపాటు ఏదో ఒకచోట ఎన్నికలు జరుగుతున్నందున.. కోడ్ అమల్లో ఉండటం తద్వారా విధానపరమైన నిర్ణయాలు తీసుకోలేక ప్రభుత్వ నిర్ణయాలకు ఆటంకంగా మారాయన్నారు. కొన్నిసార్లు ప్రభుత్వాలు సాధారణ నిర్ణయాలు కూడా తీసుకోలేని పరిస్థితి ఉందని గుర్తు చేశారు. ఎన్నికల ర్యాలీలు, బహిరంగ సభల కారణంగా.. ధ్వని కాలుష్యం, ట్రాఫిక్ జామ్‌ల కారణంగా ప్రజ లకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. లోక్‌సభ, అసెంబ్లీలకు వేర్వేరుగా ఎన్నికలు నిర్వహించడం కారణంగా అవుతున్న ఖర్చు రూ.4,500 కోట్ల పైమాటేనన్నారు.జమిలి ఎన్నికల ద్వారా జాతీయ అంశాలతోపాటుగా, ప్రాంతీయ సమస్యలపైనా సమానస్థాయిలో చర్చ జరుగుతుందని తెలిపారు. వేర్వేరుగా ఎన్నికలు నిర్వహించడంతో ఓటర్లలో ఎన్నికల ప్రక్రియ పట్ల నిరాసక్తత పెరిగి.. ఓటరుశాతం తగ్గటం స్పష్టంగా కనబడుతోందన్నారు. దీనికి జమిలి ఎన్నికలు ఓ పరిష్కారాన్ని చూపుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. జమిలి ఎన్నికల కారణంగా, దేశంలో ద్రవ్యోల్బణంలో 1.1% తగ్గుతుందని రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని కమిటీ పేర్కొందన్నారు.

## తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం అపెక్స్ కమిటీ

## సూర్యాపేట జిల్లా బాధ్యులుగా గుజ్జ రమేష్...



(హైదరాబాద్), సెప్టెంబర్ 19, ప్రజా వినికిడి: గురువారం జరిగిన సమావేశంలో కమిటీ రాష్ట్ర కన్వీనర్సర్దార్ పుట్టం పురుషోత్తం రావు చేతుల మీదుగా అపెక్స్ కమిటీ సూర్యాపేట జిల్లా బాధ్యులుగా మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గుజ్జ రమేష్ కు నియామక పత్రము ఇవ్వడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో మాజీ మంత్రి జోగు రామన్న,సి.విట్టల్ మరియు మీసాల చంద్రయ్య, అపెక్స్ కమిటీ సభ్యులు హాజరవడం జరిగింది. ఈ సందర్భంగా గుజ్జ రమేష్ మాట్లాడుతూ అపెక్స్ కమిటీ నాపైన నమ్మకంతో సూర్యాపేట జిల్లా బాధ్యతలు నాకు అప్పగించినందుకు మన మున్నూరు కాపు కులాన్ని గ్రామస్థాయిలో మరి మండల స్థాయిలో స్థానిక నాయకులను సమన్వయం చేసుకుంటూ కులాన్ని మరింత బలోపేతం చేస్తానని అపెక్స్ కమిటీ నాయకుల అందరి సమక్షంలో ప్రమాణం చేయడం జరిగింది.

## తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొక్కొండ రాహుల్ గౌడ్..

### నియామక పత్రం అందజేసిన రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షులు అధ్యక్షులు కేశం నాగరాజు గౌడ్...

**ప్రజావినికిడి,(హైదరాబాద్): సెప్టెంబర్ 19:**
తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొక్కొండ రాహుల్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షులు కేశం నాగరాజు గౌడ్ నియామక పత్రం అందజేశారు.ఈ సందర్భంగా రాహుల్ గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ లో గుర్తించినపెద్దలు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి,పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షులు కేశం నాగరాజు గౌడ్, తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం నాయకులకు ధన్యవాదాలు తెలిపారు తనకిచ్చిన పదవికి న్యాయం చేస్తానని ఈ సందర్భంగా ఆయన అన్నారు.



## అనారోగ్యంతో మరణించిన ముద్దం నరసింహ గౌడ్ కు గౌరెల్లి డ్రైవర్స్ యూనియన్ తరపున ఆర్థిక సహాయం



ప్రజావినికిడి, (అబ్దుల్లాపూర్మెట్): అబ్దుల్లాపుర్మెట్మండలం గౌరెల్లి గ్రామ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ముద్దం నరసింహ గౌడ్ అనారోగ్యంగా మరణించడంతో గౌరెల్లి గ్రామ డ్రైవర్ యూనియన్ అసోసియేషన్ తరపున 11వేల 600 నగదు 25 కేజీల బియ్యం కుటుంబానికి అందజేశారు డ్రైవర్స్ యూనియన్ వారు మాట్లాడుతూ, సానుభూతితో కుటుంబానికి మాకు తోచిన విధంగా ఎంతో కొంత సాయం చేసి ఆదుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్యార భగవాన్ దాస్, చంద్రి,ఎన్ సాయి బాబా. కే నరసింహ,సిహెచ్ కృష్ణ,కే,దర్శన్,టెంట్ హౌస్ నరసింహ, సిహెచ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


## ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా సీఎం సహాయ నిధి చెక్కును అందుకుంటున్న గ్యార లక్ష్మమ్మ గౌరెల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గ్యార భగవాన్ దాస్..

ప్రజావినికిడి, (అబ్దుల్లాపూర్మెట్): మండలం గౌరెల్లి గ్రామానికి చెందిన గ్యార లక్ష్మమ్మ భర్త క్రీస్తు శేషులు పోచయ్య సీఎం సహాయనిది 33 వేల రూపాయలు స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా 33 వేల రూపాయల చెక్కు గ్యార లక్ష్మమ్మ అందుకున్నారు.గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న లక్ష్మమ్మ కు సీఎం సహాయనిధి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు.కాంగ్రెస్ పార్టీ గౌరెల్లి గ్రామ శాఖ అధ్యక్షులు గ్యార భగవాన్ దాస్



# ఎల్బీనగర్ నాయి బ్రాహ్మణ నూతన సేవా సహకార సంఘం ఎన్నిక

ప్రజావినికిడి,(ఎల్బీనగర్,):
గురువారం రోజు అనగా,19.09.2024 బుధవారం నాడు, ఎల్బీనగర్ నాయి బ్రాహ్మణ సేవా సహకార సంఘము,శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవాలయములో జరిగిన సమావేశంలో ఎల్బీనగర్ నాయి బ్రాహ్మణ సేవా సహకార సంఘం
రిజిస్టర్ నెంబర్ 443/96
(11 )వ నూతన కార్యవర్గాన్ని ఎల్బీనగర్ నాయి బ్రాహ్మణ వ్యవస్థాపక అధ్యక్షులు ఆమంచ అంజయ్య ఆధ్వర్యంలోను మరియు
ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు రాచమల్ల బాలకృష్ణ అధ్యక్షత వహించి ఈ కార్యక్రమమును,
పాత కార్యవర్గ సభ్యుల సూచన ప్రకారము,
ఈ క్రింది వారిని ఎల్బీనగర్ నాయి బ్రాహ్మణ సేవా సహకార సంఘం నియోజకవర్గ కమిటీగా సభ్యులుగా ఎన్నుకోవడం జరిగినది.నూతన కమిటీ సభ్యులు
తెలంగాణ రాష్ట్ర నాయి బ్రాహ్మణ సంఘం,
ఉపాధ్యక్షులు, జంపాల వెంకటేశం,
ఎల్బీనగర్ గౌరవ అధ్యక్షులుగా
ఆమంచ,అంజయ్య
1,నూతన అధ్యక్షులుగా, మాంకాల,శ్రీనివాస్ నాయి, ఎల్బీనగర్(దానపురం సరూర్నగర్ రోడ్)
2,వర్కింగ్ ప్రెసిడెంట్ గా,
దాసది, కుమార్,ఎన్టీఆర్ నగర్,
3,ప్రధాన కార్యదర్శిగా,
అశ్వల,మహేష్,కర్మన్ ఘాట్,
4,కార్యదర్శిగా,
ఒంగూరీ,గోవర్ధన్, చంద్రపురి కాలనీ (ఎల్బీనగర్ రింగ్ రోడ్)
5, కోశాధికారిగా,
మాంకాల,సురేష్ కుమార్,బ్యాంక్ కాలనీ ( ఎల్బీనగర్,) 6, ఉపాధ్యక్షులుగా,
1, డాక్టర్, శ్రీనివాస్ ఎన్టీఆర్ నగర్
2,రాచమల్ల,ప్రతాప్,రాజీవ్ నగర్ కాలనీ ఎల్బీనగర్
3,కే,సత్యనారాయణ కర్మన్ ఘాట్ ఎక్స్ రోడ్
4,ఆమంచ, శ్రీకాంత్,దుర్గా నగర్ కాలనీ (కర్మన్ ఘాట్)
7,సహకార, కార్యదర్శులుగా



1,జి,మధు, దుర్గా నగర్ కాలనీ కర్మన్ ఘాట్
2,జే,తిరుపతయ్య ఎన్టీఆర్ నగర్ (ఎల్బీనగర్)
3,యం,జగదీష్ కుమార్, భగత్ సింగ్నగర్( సరూర్నగర్)
4,కే, శ్రీశైలం బైరమాల్ గూడ
5,యం,ప్రసాద్ ఆర్టీసీ కాలనీ రోడ్డు ఎల్బీనగర్
8,ప్రచార, కార్యదర్శులుగా,
1,నవీన్ కుమార్,సూర్యోదయ నగర్ కాలనీ ఎల్బీనగర్
2,ఏ,జగన్,దానపురం (సరూర్నగర్ రోడ్)
3,జె,సత్యం,బైరమల్ గూడా
4,మహేష్ జే బి కాలనీ (వైట్ హౌస్) సరూర్ నగర్
5,మహేష్ కుమార్,సరస్వతి నగర్ కాలనీ ఎల్బీనగర్
6,మల్లెపూల,శ్రీనాథ్ నాయి, లింగోజిగూడ (సరూర్నగర్)
7,పి,సాయి,గుంటి జంగయ్య నగర్ కాలనీ ఎల్బీనగర్ ఎక్స్ రోడ్
8,జే,గోవర్ధన్,సెంట్రల్ బ్యాంక్ కాలనీ ఎల్బీనగర్
9,రాచమల్ల,అనిల్ కుమార్,బ్యాంక్ కాలనీఎల్బీనగర్
9,గౌరవ,ముఖ్య సలహాదారులుగా,
1,మల్లెపూల, పెంటయ్య, ఆర్టీసీ కాలనీ రోడ్ ఎల్బీనగర్ 10,మహిళా కమిటీ,
1,మల్లెపూల,పద్మ, లింగోజిగూడ సరూర్నగర్
2,ఆర్,సరోజ బ్యాంక్ కాలనీ ఎల్బీనగర్
3,ఒంగురి,ధనలక్ష్మి, శ్రీనివాస నగర్ కాలనీ ఎల్బీనగర్
4,కాస్య,పద్మ,భరత్ నగర్ కాలనీ ఎల్బీనగర్
8,ఈ,వరలక్ష్మి, ఆర్టీసీ కాలనీ ఎల్బీనగర్,
అను పై వారిని
కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవడం జరిగినది,
ఒక వారం రోజులలో మొత్తము ఎల్బీనగర్ లో ఉన్నటువంటి అన్ని దుకాణదారులను కలిసిన తర్వాత పూర్తి కమిటీని నియమించడం జరుగును పూర్తి కమిటీ తర్వాత కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకార కార్యక్రమమును జరిపించబడును,
ముఖ్య గమనిక
ఈ నూతన కార్యవర్గ సమావేశమునకు ముఖ్యఅతిథిగా, గౌరవనీయులు,
రాష్ట్ర అధ్యక్షులు రాచమల్ల,బాలకృష్ణ,అధ్యక్షత వహించి నూతన కమిటీకి సహకరించినందుకు, వారికి ఎల్బీనగర్ నూతన కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలుపుతూ రాష్ట్ర అధ్యక్షుల సూచన ప్రకారము ఎల్బీనగర్ నియోజకవర్గ మాజీ అధ్యక్షులు జంపాల వెంకటేష్ నీ (వారు సంఘమునకు, 12,సంవత్సరములు చేసిన సేవకు గుర్తింపుగా) అతనికి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, నియమిస్తూ నియమాపక పత్రము అందజేయడం జరిగినది.
నా ఎల్బీనగర్ నాయి కుల బాంధవులు అక్కచెల్లెళ్లు అన్నదమ్ములు గత 40 సంవత్సరాల నుండి సంఘ సేవకు సహకరించినందుకు ప్రతి కమిటీ సభ్యులు నన్ను ఆదరించినందుకు వారికి తలవంచి నమస్కరించుచున్నాను.

# రాహుల్ గాంధీకి వెంటనే క్షమాపణ చెప్పాలి..

### సునీతా రావు డిమాండ్.. తర్వీందర్ సింగ్ మార్వా దిష్టిబొమ్మ దగ్ధం..



ప్రజావినికిడి,(హైదరాబాద్):
తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి సునీతా రావు ఆధ్వర్యంలో బిజెపి ఆఫీస్ ని ముట్టడించి బిజెపి మాజీ ఎమ్మెల్యే తర్వీందర్ సింగ్ మార్వా దిష్టిబొమ్మను దహనం చేయడం జరిగింది.తర్వీందర్ సింగ్ మార్వా మా ఏఐసిసి అగ్రనేత మరియు పార్లమెంట్ ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని,వారి నానమ్మను చంపినట్టు వారిని కూడా చంపుతామని బహిరంగంగా మాట్లాడిన బిజెపి మాజీ ఎమ్మెల్యే తరవీందర్ సింగ్ మార్వా బెదిరింపులను ఖండిస్తూ,రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతా రావు తో కలిసి, ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్ మరియు మహిళా కాంగ్రెస్ కమిటీ సభ్యులు,బిజెపి ఆఫీసుని ముట్టడించి, తర్వీందర్ సింగ్ మార్వా దిష్టిబొమ్మను తగులబెట్టడం జరిగింది.బేగంబజార్ పిఎస్ లో మార్వాని తక్షణమే కస్టడీలోకి తీసుకోవాలని మెమొరండం ఇవ్వడం జరిగింది.



# బడుగు బలహీన వర్గాలకు కాంగ్రెస్ చేయూత..


### షాద్ నగర్ కాంగ్రెస్ బీసీ నేతలు..

### టిపిసిసి చీఫ్ మహేష్ గౌడ్ సన్మానించిన షాద్ నగర్ కాంగ్రెస్ నాయకులు..

ప్రజావినికిడి,(హైదరాబాద్):
బడుగు బలహీన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ ఎంతో అండగా నిలబడుతుందని దానికి నిదర్శనమే టిపిసిసి చీఫ్ గా మహేష్ గౌడ్ నియామకమని
రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ కాంగ్రెస్ పార్టీ బిసి నాయకులు వ్యాఖ్యానించారు. షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నేతృత్వంలో గురువారం టిపిసిసి చీఫ్ మహేష్ గౌడ్ ను నియోజక వర్గ బీసీ నాయకులు పెద్ద ఎత్తున కలుసుకుని పూల బొకేలతో సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు పెద్దపీట వేసిందని ఈ సందర్భంగా కొత్తూరు ఉమ్మడి మండల మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్,ఓబిసి సెల్ తాలూకా అధ్యక్షులు చంద్రశేఖర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంద్రతి బాలరాజు గౌడ్, సీనియర్ నేత సుదర్శన్ గౌడ్ తదితరులు వ్యాఖ్యానించారు. బీసీలపై చిత్తశుద్ధితో వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం బిసి కులగనల ద్వారా మరింత బడుగు బలహీన వర్గాలకు



న్యాయం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తమ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు ఎమ్మెల్యేగా గెలిపించడమే కాకుండా అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ గా కూడా ప్రభుత్వం నియమించి బీసీలపై గౌరవాన్ని ప్రదర్శిస్తుందని ఈ సందర్భంగా వారు అన్నారు. టిపిసిసి చీఫ్ మహేష్ గౌడ్ సన్మానించిన వారిలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కూడా ఉన్నారు..



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక




## భారాస నేతలపై కాంగ్రెస్ దాడులకు తెగబడుతోంది

### డీజీపీ జితేందర్‌కు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేల ఫిర్యాదు



హైదరాబాద్ సెప్టెంబర్ 19,ప్రజావినికిడి:
రాష్ట్రంలో భారాస నేతలు, కార్యకర్తలపై కాంగ్రెస్ దాడులకు తెగబడుతోందని మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, వివేకానందగౌడ్, సంజయ్‌కుమార్, భారాస నాయకులు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ తదితరులు ఆరోపించారు. ఈ మేరకు గురువారం వారు రాష్ట్ర డీజీపీ జితేందర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. భారాసకు చెందిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులపై కాంగ్రెస్ మూకలు పోలీసుల ముందే దాడులకు పాల్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావుపై దాడులు జరిగినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి ఘటనలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీపై పోలీసులు ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు.

## తిరుమల లడ్డూ ప్రసాదంపై టీడీపీ, వైసీపీ నీచ రాజకీయాలు: వైఎస్ షర్మిల



తిరుమల,సెప్టెంబర్ 19,ప్రజావినికిడి:
శ్రీవెంకటేశ్వరుడి ప్రసాదం లడ్డూపై తీవ్ర రాజకీయ దుమారం నడుస్తోంది. ఈ పవిత్రమైన లడ్డూ ప్రసాదం తయారీకి జంతువుల నూనెలు వాడారని స్వయంగా సీఎం చంద్రబాబు నాయుడు ఆరోపణలు చేయడం కలకలం రేపింది. పవిత్రమైన తిరుమల ఆలయంపై అలాంటి వ్యాఖ్యలు చేయడం పట్ల ఇప్పుడు నెట్టింట చర్చకు దారితీసింది. కాగా చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ఖండించారు. దేవుడిని రాజకీయాల్లోకి లాగొద్దని ఆమె హితవు పలికారు. ఈ మేరకు తిరుమల లడ్డూపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై వైఎస్ షర్మిల 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించారు. తిరుమలను అపవిత్రం చేస్తూ, హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా టీడీపీ, వైసీపీలు నీచ రాజకీయాలు చేస్తున్నాయని ఆమె మండిపడ్డారు. సీఎం హోదాలో లడ్డూ ప్రసాదంలో నెయ్యికి బదులు జంతువుల నూనెలు వాడారంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు తిరుమల పవిత్రత, ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉన్నాయని షర్మిల ఆందోళన వ్యక్తం చేశారు. కోట్లాదిమంది హిందువుల ఆరాధ్య దైవం వేంకటేశ్వరుడికే మచ్చ తెచ్చేలా ఉన్నాయని తెలిపారు. చంద్రబాబు చేసిన ఆరోపణల్లో రాజకీయ కోణం లేకుంటే... భావోద్వేగం మీద రాజకీయం చేసే ఉద్దేశమే లేకుంటే.. నెయ్యికి బదులు జంతువుల నూనెలు నిజంగా వాడి ఉంటే... తక్షణమే ఉన్నత స్థాయి కమిటీ వేయాలని షర్మిల డిమాండ్ చేశారు.
అలాగే సీబీఐతో విచారణ జరిపించాలని కోరారు. మహా పాపానికి.. ఘోర అపచారానికి పాల్పడిన నీచులెవరో తేల్చండని ఆమె సవాల్ విసిరారు. చంద్రబాబు తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉండాలని, నిజాలు నిగ్గు తేల్చాలని షర్మిల డిమాండ్ చేశారు.

### మొగిలి ఘాట్ రోడ్డు ప్రమాదం

## రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు !




చిత్తూరు, సెప్టెంబర్ 19,ప్రజావినికిడి:
: చిత్తూరు జిల్లా బంగారు పాళ్యం మండలం మొగలి ఘాట్ రోడ్డులో ఈ నెల 13న జరిగిన ఘోర బస్సు ప్రమాదంపై పూర్తి నివేదిక సమర్పించాలని సుప్రీంకోర్టు రోడ్డు భద్రతా కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. ఈ కమిటీ చైర్‌పర్సన్ జస్టిస్ అభయ్ మనోహర్‌స్రే, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్‌కు నోటీసులు జారీ చేశారు. నెలలోపు పూర్తి నివేదికను సమర్పించాలని వారిని కోరారు.మొగిలి ఘాట్ రోడ్డులో ఈ నెల 13న ఆర్టీసీ బస్సు రెండు లారీలను ఢీకొనడంతో 8 మంది మృతి చెందగా, 33 మంది గాయపడ్డారు. దీనికి సంబంధించి సుప్రీంకోర్టు రోడ్డు భద్రతా కమిటీ కేసును సుమోటోగా స్వీకరించింది. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది.వేగ నియంత్రణపై దృష్టి సారించాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ప్రమాదం జరిగిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల గురించి తనకు తెలియజేయాలని ఆదేశించారు. పూర్తి నివేదికను అక్టోబర్ 20లోగా తమకు అందజేయాలని ఆదేశించారు.

# తిరుమల లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు

## చంద్రబాబు వ్యాఖ్యలతో ప్రజల్లో గందరగోళం



అమరావతి,సెప్టెంబర్ 19,ప్రజావినికిడి:
తిరుమల లడ్డూ తయారీలో జంతువుల కొవ్వును వినియోగించారన్న సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారాయి. ఈ వివాదంతో అటు వైసీపీ, టీడీపీ నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ తరుణంలో టీటీడీ బోర్డు మాజీ మెంబర్ రమణ కీలక వ్యాఖ్యలు చేశారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న బటర్ ఆయిల్‌తో లడ్డూ ప్రసాదం తయారు చేశారని సంచలన ఆరోపణలు చేశారు. తిరుమలలో మాజీ ఈవో ధర్మారెడ్డి వచ్చాకే నెయ్యి గోల్‌మాల్ జరిగిందని దుయ్యబట్టారు. టీటీడీ రూల్స్‌ను పక్కనపెట్టి ట్రేడర్స్‌ను తీసుకొచ్చారన్నారు. ఢిల్లీ నుంచి ఆల్ఫా అనే సంస్థను తిరుమలకు తీసుకొచ్చారని.. ఆల్ఫా కంపెనీ విదేశాల నుంచి బటర్ ఆయిల్‌ను దిగుమతి చేసుకుంది. బటర్ ఆయిల్‌లో గేదె, ఆవు, జంతువుల నెయ్యి కలిసి ఉంటుంది. బటర్ ఆయిల్‌తో తిరుమల లడ్డు ప్రసాదం తయారు చేశారు. ఆవు నెయ్యి కాకపోవడంతో లడ్డు నాణ్యత పూర్తిగా తగ్గిపోయింది. మాజీ ఈవో ధర్మారెడ్డి కమిషన్ కోసం కక్కుర్తిపడి, భక్తుల మనోభావాలను దెబ్బతీశారని టీటీడీ బోర్డు మాజీ మెంబర్ రమణ ధ్వజమెత్తారు. మరోవైపు తిరుమల లడ్డూకు నెయ్యి సరఫరా చేసే సరఫరాదారుల్లో ఒకరు కల్తీ నెయ్యిని సరఫరా చేస్తున్నట్టు టీటీడీ ఈ ఏడాది జూలైలో అధికారికంగా వెల్లడించిన సంగతి తెలిసిందే. ఒక కంపెనీని సైతం బ్లాక్ లిస్టులో పెట్టామని కూడా పేర్కొంది. తిరుమల లడ్డూకి వినియోగించేది జంతువుల కొవ్వా? ఆవు నెయ్యా? ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యల తర్వాత భక్తుల్లో నెలకొన్న ప్రశ్న ఇది. గత ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డు ప్రసాదం తయారీలో ఆవు నెయ్యికి బదులు జంతువుల కొవ్వు వినియోగించారని మండిపడ్డారు సీఎం చంద్రబాబు. ఈ వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. ఇక లడ్డూ ప్రసాదంపై సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు టీటీడీ మాజీ ఛైర్మన్, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి మండిపడ్డారు. దీనిపై తన కుటుంబంతో సహా ప్రమాణం చేయడానికి సిద్ధమేనని చంద్రబాబుకు సవాల్ విసిరారు వైవీ సుబ్బారెడ్డి. తిరుమల లడ్డూ తయారీలో చాలా జాగ్రత్త తీసుకుంటారు. తిరుమల లడ్డూకు ప్రతీ రోజూ 300-500 లీటర్ల నెయ్యిని వినియోగిస్తుంది టీటీడీ. టీటీడీ మార్కెటింగ్ విభాగం ద్వారా నెయ్యిని కొనుగోలు చేస్తోంది. ప్రతి 6 నెలలకొకసారి టెండర్లు పిలిచి ఇ- ప్రోక్యూర్‌మెంట్ ద్వారా నెయ్యిని సమకూర్చుకుంటుంది. నెయ్యి నాణ్యతను పరీక్షించేందుకు ల్యాబ్ కూడా తిరుమలలోనే ఉంది. ఇన్ని అంచెలు దాటి కల్తీ నెయ్యి, అది కూడా జంతువుల కొవ్వు నుంచి తీసింది వాడటం అనే టాపిక్ భక్తులను ఆందోళనకు గురిచేస్తోంది. 2021 మార్చి వరకు టీటీడీకి కర్ణాటక మిల్క్ ఫెడరేషన్‌కు చెందిన నందిని బ్రాండ్ నెయ్యి సరఫరా అయ్యేది. 2021 మార్చి లో జరిగిన టెండర్లలో ఒ-3 గా నిలిచింది. అయినా కూడా ఒ-1, ఒ-2 అనుమతితో కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ తిరుమలకు అవసరైన నెయ్యిలో కేవలం 20 శాతం సప్లై చేసింది. ఆ తర్వాత నుంచి మాత్రం టెండర్ పక్రియలోనే పాల్గొనలేదు. యూపీకి చెందిన ప్రీమియర్ ఒ-1 గా, ఒ-2గా ఆల్ఫా కంపెనీలు నెయ్యి సరఫరా చేసేందుకు అర్హత పొందగా కేజీ నెయ్యి రూ. 424 లు ప్రకారం టీటీడీకి సప్లై చేసేలా ఒప్పందం కుదుర్చుకుంది. అయితే ఈ ధరకు తమకు గిట్టుబాటు కాదంటూ కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ టెండర్ పక్రియలోనే పాల్గొనలేదు. టీటీడీకి నాణ్యమైన నెయ్యిని తక్కువ ధరకు సరఫరా చేయలేమని ఫెడరేషన్ తేల్చి చెప్పింది. దీంతో తక్కువ ధరకు నాసిరకం నెయ్యి కొనుగోలు చేస్తుందంటూ టీటీడీపై ఆరోపణలు వెల్లువెత్తాయి.

## అక్టోబర్ 2 నుంచి ప్రక్రియ

### కొత్త రేషన్ కార్డులపై సీఎం రేవంత్



హైదరాబాద్ సెప్టెంబర్ 19,ప్రజావినికిడి: తెలంగాణ ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి శు భవార్త అందజేశారు. చాలా రోజుల నుంచి ప్రజలు కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి కొత్త రేషన్ కార్డు దరఖాస్తుల స్వీకరణకు ముహూర్తం ఖరారు చేశారు.
గురువారం రోజున సచివాలయంలో జరిగిన సమావేశంలో కొత్త రేషన్ కార్డు దరఖాస్తుల అంశంపై రేవంత్ రెడ్డి చర్చించి కీలక నిర్ణయం తీసుకున్నారు.
అక్టోబర్ 2వ తేదీ నుంచి కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తామని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దరఖాస్తులను అక్టోబర్ మొదటివారంలో తీసుకొని నెల చివరి వరకు అర్హుల జాబితాను ఫైనల్ చేసి కార్డులని లబ్ధిదారులకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలంటూ సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు. అయితే ఈ అంశంపైన త్వరలోనే మరోసారి సమీక్ష నిర్వహిస్తామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మరోసారి సమీక్షించి విధి విధానాలు ఫైనల్ చేయడంతో పాటుగా ఎప్పటి వరకు రేషన్ కార్డులను జారీ చేయాలన్నది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.



## కాకి రూపంలో పితృదేవతలు !

హైదరాబాద్‌సెప్టెంబర్ 19,ప్రజావినికిడి:
మహాలయంలో మనం కాకులకు ఆహారం ఎందుకు పెడతాము? మన పూర్వీకులు కాకులుగా మారారా? అయితే ఇంతటి అల్ప పక్షిగా ఎందుకు మారారు? ఏదైనా పెద్ద స్థాయిలో ఉన్న పక్షిగా ఎందుకు మారలేదు?' అని భక్తుడొకరు పరమాచార్య స్వామివారిని అడిగాడు.స్వామివారు ఒకసారి చిరునవ్వి, 'తమిళంలో మనం కాకిని 'కాకా' అని పిలుస్తాము. ఇక ఏదైనా ప్రాణిని మనం అవి చేసే శబ్దాలతో పిలుస్తామా? పిల్లిని 'మ్యావ్' అని, చిలుకలు కికి అంటాయి కాబట్టి వాటిని 'కికి' అని పిలుస్తామా? లేదు! కాకిని దాని అరుపుతో పిలుస్తాము. అదే దాని ప్రత్యేకత. క అంటే కాపాత్తు (కాపాడు), రక్షించు అని అర్థం. కనుక నువ్వు కాకికి ఆహారం పెట్టి 'కా కా' అని పిలిస్తే, కాపాడు అని పితృదేవతలని అడిగినట్టు! విరివిగా ఉంటాయి, ఏది పడితే అది తింటాయి కాబట్టి కాకిని నువ్వు అల్పపక్షి అంటున్నావు. కాకి ఎంత గొప్పదో ఇప్పుడు చెబుతాను విను. అది బ్రహ్మముహూర్తంలో లేస్తుంది. కా.. కా అని అరచి నిన్ను నిద్రలేపుతుంది. ఒక్కోసారి కోళ్ళు సరిగ్గా సమయానికి లేవవు. కాని కాకి సరైన సమయానికి లేస్తుంది. అది కా..కా అని అరుస్తూ నీ జపానికి సరైన సమయమైన బ్రహ్మముహూర్తంలో నిన్ను నిద్రలేపుతుంది. అది పూజకు సరైన నిర్దేశం. అంతేకాక, దానికి ఆహరం దొరికితే ఇతర కాకులను పిలుస్తుంది. ఆహారాన్ని పంచుకుని తినండి అని మనకు తెలిపే వేరే ప్రాణుల్లో కనపడని ఒక ప్రత్యేకక లక్షణం కలిగినది. మరలా సాయంత్రం నిద్రకు ఉపక్రమించే ముందు, మరలా కా..కా అని అంటుంది. ఆ రోజు జరిగిన అన్ని విషయాలకు భగవంతునికి కృతజ్ఞతగా. అలాగే, కాకులు సూర్యాస్తమయం తరువాత ఏమీ తినవు. ఇది శాస్త్రములు చెప్పిన ఉత్తమమైన విషయం కూడా. ఇది ఎంతమంది పాటిస్తున్నారు?కనుక నాకు తెలిసి కాకి అల్ప ప్రాణి కాదు. అది మనకు ఎంతో నేర్పుతుంది. అందుకే పితృ దేవతలు కాకి రూపంలో వస్తారు. మరొక్క విషయం . . . కేవలం మహాలయంలోనే కాదు, ప్రతిరోజూ కాకికి ఆహారం పెట్టు.కాకి మనకు అద్వైతాన్ని కూడా నేర్పుతుంది.నువ్వు పెట్టిన ఆహారాన్ని చూడగానే కాకి ఎంతో సంతోషపడి ఆ ఆహారాన్ని స్వీకరిస్తుంది. అది తినడం చూడడం వల్ల నువ్వు కూడా ఆనందాన్ని పొందుతావు. కనుక ఇరువురు ఆనందంగా ఉంటారు. ఇద్దరూ భగవత్ స్వరూపులే!' అని తెలిపారు.

## హెూమ్ గ్రౌండ్ బాక్స్ క్రికెట్ ఘనంగా ప్రారంభోత్సవం..



ప్రజావినికిడి, (పెద్దఅంబర్పేట్): మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద అంబర్పేట్ పసుమముల రోడ్లో హెూమ్ గ్రౌండ్ బాక్స్ క్రికెట్ ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిలుగా వైస్ చైర్మన్ చామ సంపూర్ణ శేఖర్ రెడ్డి, బ్యాంకు డైరెక్టర్ మహేందర్ రెడ్డి,హాజరై ఘనంగా ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ, యువత శారీరకంగా దృఢంగా మానసింగా ఉల్లాసం కోసం ఆటలు ఎంతో ప్రాముఖ్యతమని అన్నారు.యువకులు కాసేపు క్రికెట్ ఆడితే మానసికంగా దృఢంగా ఉంటారని వారికి ఈ ప్రాంతంలో ఈ క్రికెట్ గ్రౌండ్ ఏర్పాటు చేసినందుకు నిర్వాహలకును వారు అభినందించారు. అనంతరం నిర్వాహకులు దొంద శశిధర్ రెడ్డి మాట్లాడుతూ,మావద్ద క్రికెట్ గ్రౌండ్ గంటకు 500 రూపాయలు రెంటు తీసుకుంటామని,అదే విధంగా వచ్చిన క్రీడాకారులకు ఫుడ్డు, స్నాక్స్ టీ తదితర అందజేయబడతాయని,చుట్టుపక్కన ప్రాంతాలు క్రికెట్కు గ్రౌండ్ వినియోగించాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు వడ్డేపల్లి విద్యా విజేందర్రెడ్డి,పసుల రాజేందర్,కందాడ అనుపమ సుప్రసేనారెడ్డి,దండం కృష్ణారెడ్డి, అర్చన దామోదర్,మజీద్పూర్ సర్పంచ్ సుధాకర్ రెడ్డి, కో ఆప్షన్ నెంబరు స్థానిక కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# బయటకు వచ్చిన స్వయంభు వర్కింగ్ స్టిల్




టాలీవుడ్ యాక్టర్ నిఖిల్ సిద్దార్థ నటిస్తోన్న తాజా చిత్రం స్వయంభు. నిఖిల్ తొలి పాన్ ఇండియా సినిమాగా వస్తోన్న 20లో మలయాళ బ్యూటీ సంయుక్తామీనన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. కేజీఎఫ్ చిత్రానికి అదిరిపోయే బీజీఎం అందించిన రవిబస్రూర్ స్వయంభు చిత్రానికి మ్యూజిక్ డైరెక్టర్ అని తెలిసిందే. కాగా చాలా రోజుల తర్వాత స్వయంభు అప్‌డేట్ స్టిల్ రూపంలో బయటకు వచ్చింది. ప్రస్తుతం స్వయంభు
మ్యూజిక్ సెషన్స్ కొనసాగుతున్నాయి. రవి బస్రూర్ పాటల రికార్డింగ్ సెషన్‌లో ఉన్నాడు. సరస్వతీ పుత్ర రామజోగయ్య శాస్త్రి, డైరెక్టర్ భరత్ కృష్ణమాచారి, రవి బస్రూర్ కలిసి ఉన్న స్టిల్ ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. ఇప్పటికే కార్తికేయ ఫ్రాంఛైజీతో నార్త్‌లో మంచి ఫేం సంపాదించిన నిఖిల్‌కు రవిబస్రూర్ బాణీలు మరింత ఇమేజ్‌ను తెచ్చిపెట్టే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయంటున్నారు సినీ జనాలు. ఈ చిత్రానికి భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్నాడు. ఠాగూర్ మధు సమర్పణలో పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. స్వయంభులో నిఖిల్ యుద్ధ వీరుడిగా ఇదివరకెన్నడూ కనిపించని సర్‌ప్రైజింగ్ లుక్‌లో మెరువబోతున్నట్టు ఇప్పటివరు విడుదల చేసిన పోస్టర్లు చెబుతున్నాయి.

# ఆలోచించి దేవర టైటిల్ ఖరారు చేశాం

## అసలు విషయం చెప్పిన ఎన్టీఆర్



ఎన్టీఆర్ నటించిన తాజా చిత్రం 'దేవర' కొరటాల శివ దర్శకుడు. సెప్టెంబర్ 27న ఇది ప్రేక్షకుల ముందుకురానుంది. ఈనేపథ్యంలో ఇటీవల జరిగిన ఓ ప్రెస్‌మీట్‌లో తన చిత్రానికి సంబంధించిన పలు విశేషాలను తారక్ పంచుకున్నారు. సినిమా విడుదల దగ్గరవుతున్న తరుణంలో టెన్షన్‌గా ఉందన్నారు. సినిమాపై నమ్మకంగా ఉన్నానని.. టీమ్ అంతా ఎంతో కష్టపడి వర్క్ చేశామని తెలిపారు. అనిరుధ్ మ్యూజిక్‌ను మెచ్చుకుంటూ.. తన సంగీతంతో అనిరుధ్ అదరగొడుతున్నారు. ప్రస్తుతం ఆయన శకం నడుస్తోంది. విజయం అందుకున్న కొంతకాలానికి వివిధ కారణాల వల్ల చాలామంది విఫలం అవుతారు. కానీ అనిరుధ్ అలా కాదు. ఒక సినిమాకు సంగీతం ఎంత అవసరమో అతనికి బాగా తెలుసు. అతను అద్భుతమైన వ్యక్తి. అనుకున్నవిధంగా రిజల్ట్ వచ్చేవరకూ కష్టపడుతూనే ఉంటాడు. జైలర్, విక్రమ్, మాస్టర్ చిత్రాలకు ఆయన అద్భుతమైన మ్యూజిక్ అందించాడు. ఏఆర్ రెహమాన్ స్థాయికి అనిరుధ్ వెళ్తాడు. అంతర్జాతీయ చిత్రాలకూ కంపోజ్ చేస్తాడని ఎన్టీఆర్ అన్నారు. 'ఆర్ఆర్ఆర్' మాదిరిగా, దేశవ్యాప్తంగా ప్రేక్షకులకు చేరువయ్యే టైటిల్ పెట్టాలనుకున్నామని.. ఆ విధంగా 'దేవర' ఫైనల్ చేశామని చెప్పారు. 'దేవర' అంటే దేవుడు అని అర్థం అన్నారు. హీరోయిన్‌గా జాన్వీకపూర్ ను తొలుత అనుకోలేదన్నారు. కథ రాస్తున్నప్పుడు కథానాయికగా ఎవరిని ఎంచుకోవాలనే విషయంలో మాకు ఎలాంటి ఆలోచన లేదు. అలాంటి సమయంలో కరణ్ జోహార్ ఒకసారి కాల్ చేసి.. 'జాన్వీ మంచి నటి. ఆమెను మన సినిమాలో తీసుకుంటే బాగుంటుందని చెప్పారు. ఆ తర్వాత కూడా మేము ఆమెను తీసుకోవాలని అనుకోలేదు. కానీ, జాన్వీకపూర్ ఇందులో భాగం కావాలని బలంగా కోరుకున్నారు. స్క్రిప్ట్ రైటింగ్ పూర్తయ్యే సమయానికి ఆమె టీమ్‌లోకి వచ్చారు. యాక్టింగ్, భాష విషయంలో జాన్వీ తొలుత ఎంతో కంగారుపడ్డారు. కానీ, చక్కగా యాక్ట్ చేశారు. ఆమె యాక్టింగ్‌తో షాక్‌కు గురి చేశారని ఆయన తెలిపారు. ఎన్టీఆర్ ద్విపాత్రాభినయంలో కనిపించనున్నారు. సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. 'దేవర' రెండు భాగాల్లో విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినీప్రియులను ఆకట్టుకున్నాయి. సినిమాపై అంచనాలు పెంచేశాయి.




# ఉమెన్స్ ప్రొటెక్షన్ సెల్‌ని సిద్ధం చేయాలి

## మా ను కోరుతూ మంచు పోస్ట్

ఇచ్చిన మాట ప్రకారం ఉమెన్స్ ప్రొటెక్షన్ సెల్‌ని వెంటనే సిద్ధం చేయాలని మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్‌ను కోరుతున్నానంటూ మంచు మనోజ్ పోస్ట్ చేశారు. దానికంటూ ప్రత్యేకంగా సోషల్‌మీడియా ఖాతాలు ఏర్పాటు చేయండి. మన పరిశ్రమలోని మహిళలకు గళంగా నిలవండి. తాము ఒంటరిగా లేమని.. తమ బాధను వింటామనే విషయాన్ని ప్రతి మహిళకు తెలియజేయండి. ఈ క్లిష్ట పరిస్థితుల్లో అండగా నిలబడిన మన పరిశ్రమ పెద్దలు, సహోద్యోగులకు నా మద్దతు తెలియజేస్తున్నా. న్యాయం, గౌరవం అనేది మాటల్లో మాత్రమే కాకుండా చేతల్లోనూ చూపించే విధమైన సమాజాన్ని నిర్మిద్దాం. కుమార్తె, సోదరి, తల్లి.. ఇలా ప్రతి మహిళ కోసం ఈ పోరాటం. వారికి అన్యాయం జరగకుండా చూద్దాం' అని మనోజ్ కోరారుడ్యాన్స్ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. దీనిని ఉద్దేశించి తాజాగా నటుడు మంచు మనోజ్ ఎక్స్ (ట్విటర్)లో పోస్ట్ పెట్టారు. 'జానీ మాస్టర్.. కెరీర్ పరంగా ఈ స్థాయికి వచ్చేందుకు మీరు ఎంతలా శ్రమించారో అందరికీ తెలుసు. కానీ, ఈరోజు మీపై ఇలాంటి తీవ్ర ఆరోపణలు రావడం చూస్తుంటే నా హృదయం ముక్కలవుతోంది. నిజం ఎప్పటికైనా బయటపడుతుంది. ఎవరిది తప్పు, ఎవరిది ఒప్పు అనేది చట్టం నిర్ణయిస్తుంది. ఒక మహిళ తన స్వరాన్ని వినిపించినప్పుడు పారిపోవడం అనేది సమాజానికి, రానున్న తరాలకు ఒక ప్రమాదకరమైన సందేశాన్ని ఇస్తుంది. ఈ కేసు విషయంలో త్వరితగతిన స్పందించి చర్యలు తీసుకున్న హైదరాబాద్ సిటీ పోలీస్, బెంగళూరు నగర పోలీస్‌లకు నా అభినందనలు. చట్టానికి ఎవరూ అతీతులు కాదని ఇది తెలియజేస్తుంది. జానీ మాస్టర్.. నిజాన్ని ఎదుర్కొండి. మీరు ఏ తప్పు చేయకపోతే పోరాటం చేయండి. మీరు దోషి అయితే.. దానిని అంగీకరించండని హితవు పలికారు.

# మరిన్ని చిక్కుల్లో కంగనా రనౌత్




సిక్కుల ప్రతిష్ఠ దిగజార్చే ప్రయత్నం చేశారంటూ చండీగఢ్ లోని జిల్లా కోర్టులో పిటిషన్ తాను సొంతంగా తెరకెక్కించిన వివాదాస్పద చిత్రం 'ఎమర్జెన్సీ'తో బాలీవుడ్ ఫైర్ బ్రాండ్, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ చిక్కుల్లో పడింది. తాజాగా ఆమెకు ఇబ్బందులు మరింత ఎక్కువయ్యాయి. చండీగఢ్ లోని ఓ జిల్లా కోర్టు కంగనకు నోటీసులు జారీ చేసింది. జిల్లా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, న్యాయవాది రవీందర్ సింగ్ బస్సి ఆమెపై కోర్టులో పిటిషన్ వేశారు. 'ఎమర్జెన్సీ' సినిమాలో సిక్కుల ప్రతిష్ఠను దిగజార్చే ప్రయత్నం కంగన చేసిందని తన పిటిషన్ లో రవీందర్ సింగ్ ఆరోపించారు. సిక్కులను కించపరిచేలా చూపించడమే కాకుండా, సిక్కు సామాజికవర్గంపై పలు అసత్య ఆరోపణలు చేశారని... ఆమెపై కేసు నమోదు చేయాలని పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ నేపథ్యంలో కంగనకు కోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను డిసెంబర్ 5వ తేదీకి వాయిదా వేసింది. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జీవితం, ఎమర్జెన్సీ ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కింది. ఈ చిత్రానికి కంగన దర్శకత్వం వహించారు. వాస్తవానికి సెప్టెంబర్ 6న ఈ చిత్రం విడుదల కావాల్సి ఉంది. ఇప్పటికే సినిమా ట్రైలర్ కూడా విడుదలయింది. అయితే, ఈ చిత్రాన్ని నిషేధించాలని కోరుతూ హర్యానా హైకోర్టులో పిటిషన్ దాఖలయింది. వివాదాస్పద సన్నివేశాలను తొలగించిన తర్వాతే సినిమాను విడుదల చేయాలని పిటిషన్ లో కోరారు. ఈ సినిమాకు ఇంకా సెన్సార్ సర్టిఫికెట్ రాకపోవడంతో... విడుదలను వాయిదా వేశారు. సెన్సార్ క్లియరెన్స్ వచ్చిన తర్వాత కొత్త విడుదల తేదీని మేకర్స్ ప్రకటించనున్నారు.

# డాక్టర్ పిసి ఆదిత్య

## శబ్దంతో సరికొత్త ప్రయోగం..




**ప్రజావినికిడి, (సినిమా):** నిత్య ప్రయోగశీలి విలక్షణ దర్శకుడు గతంలో సినిరంగంలో ఎన్నో ప్రయోగాలు చేసి ఎందరో కొత్తవారికి అవకాశాలిచ్చి రికార్డులు సృష్టించి అవార్డులు సాధించి తనకంటూ ప్రత్యేకతను పొంది ఉన్నారు పూర్తిస్థాయి సినిమాలతో పాటు సరికొత్త ప్రయోగాలకు ఎప్పుడు ముందుండే డాక్టర్ పిసి ఆదిత్య గతంలో ఏకధాటిగా 100 రోజుల్లో 100 సందేశాత్మక లఘు చిత్రాలకు దర్శకత్వం వహించే ప్రపంచ రికార్డు సృష్టించారు. అలాగే తేదీ 11వ తేదీ 11 2011వ తేదీన 11 కెమెరాల వాడి 11 లొకేషన్లో 11 మందిని నటీనటులతో 11 గంటలు అను సందేశాత్మక చిత్రాన్ని రూపొందించి మరో ప్రపంచ రికార్డు పొందారు ఇటీవలే తెరపై ఒకే ఒక క్యారెక్టర్ తో 22 నిమిషాల నిడివి గల సంచలనాత్మక లఘు చిత్రం వంతు లో తీసే ఆదిత్య నటన అద్భుతంగా పండింది కదా అవసరంతో రూపొందించిన వంతు చిత్రం ఇప్పటికే అనేక అంతర్జాతీయ స్థాయిలో జాతీయ స్థాయిలో అవార్డులు పొందుతున్నారు ఇదే తరహాలో ఇప్పుడు పిసి ఆదిత్య మరోశించలనానికి తెర తీస్తున్నారు వివరాల్లోకి వెళితే సినిమా అంటే దృశ్యం ప్లస్ శబ్దం కాంబినేషన్ ఈ రెండు ప్రేక్షకులను కట్టిపడేస్తాయి అయితే వినూత్నంగా ఆలోచించి శబ్దాన్నే దృశ్యంగా మారిస్తే ప్రతి శబ్దం ప్రేక్షకు అలరిస్తాయి ఆకట్టుకుంటాయి అందుకే ఆదిత్య ఈ ప్రయోగానికి శబ్దం అని పేరు పెట్టారు రెండు గంటల నిడివి గల పూర్తిస్థాయి సినిమా ఇది శబ్దంతో నడిపించే కథనం కచ్చితంగా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది అనేది నా నమ్మకం ఇందులోనూ కొందరు నూతన నటీనటులకు అవకాశం కల్పించనున్నారు. ప్రస్తుతం ఆడిషన్స్ నిర్వహిస్తున్నారు కనుక ఆసక్తి అర్హత గల నూతన కళాకారులు అవకాశం నిమిత్తం చిత్ర దర్శకుడు పిసి ఆదిత్య ఫోన్ నెంబర్ 9705317188లో సంప్రదించగలరు :

~ మీ విధేయుడు డాక్టర్ పి.సి ఆదిత్య సినీ దర్శకుడు

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613